క్లీన్ అండ్ గ్రీన్ సిటీనే లక్ష్యం

- నెల్లూరు సుందరీకరణకు కృషి చేస్తా
- ఆక్రమణలను ఉపేక్షించం

నెల్లూరును అన్నివిధాలా అభివృద్ధి చేసి క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తానని నగరపాలక కమిషనర్ సూర్యతేజ అన్నారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు పూర్తయిన నేపథ్యంలో 'సాక్షి' జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు వెల్లడించారు.

– నెల్లూరు(బారకాసు)


'సాక్షి' ఇంటర్వ్యూలో కమిషనర్ సూర్యతేజ

ప్రశ్న: బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిశీలించిన అంశాలు ఏవి?

సమాధానం: మొదటగా పారిశుద్ధ్యం మెరుగునకు అధిక ప్రాధాన్యం ఇచ్చి చర్యలు చేపడుతున్నాం. నగర సుందరీకరణకు పనులు చేపడుతున్నాం. ఇందుకోసం 54 డివిజన్లలో ఇంటింటా చెత్త సేకరణ సజావుగా జరిగేలా చూస్తున్నాం. మరమ్మతులకు గురైన చెత్త తొలగింపు వాహనాలను అధిక సంఖ్యలో వాడుకలోకి తీసుకొచ్చాం. కాలువల పూడికకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాం. ఇందుకోసం అదనంగా దాదాపు 500 మంది కార్మికులను నియమించి అన్ని మురుగు కాలువల్లో పూడికలు, పెద్ద కాలువల్లోని సిల్ట్ తొలగించి మురుగు సాఫీగా ప్రవహించేలా చేశాం. శానిటేషన్ మెరుగు కోసం నగరంలో 90 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకోబోతున్నాం. ఇప్పటికే 30 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: నగరం గుంతలమయంగా మారింది. దీనిపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సమాధానం: నగరంలో వెయ్యికిపైగా గుంతలున్నట్లు గుర్తించాం. వీటిలో 260 గుంతలను పూడ్చేశాం. మిగిలిన వాటిని కూడా పూడ్చేందుకు టెండర్లు పిలిచి ఉన్నాం. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించి గుంతలను పూడ్చేస్తాం. అలాగే కొన్ని ప్రాంతాల్లో రోడ్లు వేయాల్సి ఉంది. వాటిని కూడా త్వరలో ప్రారంభించేలా చర్యలు చేపడుతాం. ప్రస్తుతం పొదలకూరు రోడ్డులో డివైడర్ నిర్మాణం చేపట్టాం. అంతేకాకుండా నగరం మొత్తం పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేపట్టాం. డివైడర్లలో గ్రీనరీ పెంచేందుకు అడ్డంకిగా ఉన్న లాలీపప్ బోర్డులను తొలగించాం. 7 వేల పెద్ద మొక్కలను నాటబోతున్నాం. ఇప్పటికే కొన్ని మొక్కలు నాటాం. నగరంలో ముఖ్యమైన పార్కులను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం.

ప్రశ్న: ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సమాధానం: ప్రభుత్వ నిబంధనల మేరకే భవన నిర్మాణాలు జరగాలి. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. నా పరిశీలనలో వెలుగు చూసిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నా. భవన నిర్మాణ అనుమతులు త్వరితగతిన ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ–ఆఫీస్‌ను కొనసాగిస్తున్నాం. దీని ద్వారా ఫైల్స్ పెండింగ్ లేకుండా చూస్తున్నాం. ఇప్పటి వరకు దాదాపు 1700 ఫైల్స్‌ను క్లియర్ చేశా. రోడ్డుకిరువైపులా ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన దుకాణాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. త్వరలో నగరంలోని ఏడు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్ లైట్స్‌ను ఏర్పాటు చేయబోతున్నాం. ఇందుకోసం రూ.1.50 కోట్లు ఖర్చు చేయనున్నాం.

ప్రశ్న: నగరంలోని విద్యుద్దీపాల పరిస్థితి ఏమిటి?

కమిషనర్: నగరంలో మొత్తం 36 వేల విద్యుద్దీపాలుండగా, మరో 3 వేలు అవసరమని గుర్తించాం. ప్రతివీధిలో విద్యుద్దీపాలుండేలా చూస్తున్నాం. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోతున్నాం. నగరంలో అండర్ డ్రెయినేజీ పనులు ప్రారంభమయ్యాయి. ఇవి పూర్తయితే ఎక్కడా కూడా నీరు నిల్వ చేరే పరిస్థితి ఉండదు. ఈ పనులు చేపడుతున్న ఎల్‌అండ్‌టీ సంస్థ వారికి ఉన్న బకాయిల్లో రూ.15 కోట్లు చెల్లించాం.

ప్రశ్న: రెవెన్యూలో బదిలీలు చేయడం వల్ల లక్ష్యాలను ఎలా అధిగమించగలరు?

సమాధానం: బదిలీలు సర్వసాధారణం. రాష్ట్రంలో 17 కార్పొరేషన్లుంటే అందులో పన్నుల వసూళ్లలో నెల్లూరు చివరిస్థానంలో ఉంది. అందువల్ల రెవెన్యూ విభాగంలో బదిలీలు చేయాల్సి వచ్చింది. రెవెన్యూ విభాగంలో ఆర్వోలు, ఆర్‌ఐలలో ముగ్గురు మినహా మిగిలిన వారు అనేక సంవత్సరాలుగా ఒకేచోట ఉన్నారు. దీంతో వారందరి స్థానాల్లో ఇతర ఉద్యోగులకు అవకాశం కల్పిస్తూ బదిలీ చేశాం. ప్రతిరోజూ పన్ను వసూళ్లపై పరిశీలిస్తున్నా. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేదు. అనుకున్న లక్ష్యాలను సాధించగలమనే నమ్మకం ఉంది. రెండు ఆర్వో పోస్టులుంటే ప్రస్తుతం ఒక్క ఆర్వో పోస్టులో మాత్రమే నియమించాం. పరిస్థితిని బట్టి మరో ఆర్వో పోస్టులో కూడా నియమించేలా చూస్తాం. నెల్లూరు నగరాన్ని మంచి సిటీగా మార్చాలనేదే నా ప్రయత్నం. అందుకోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నా అంటూ తన ఇంటర్వ్యూను ముగించారు.

క్లుప్తంగా

తల్లిదండ్రులను ఆహ్వానించండి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఈనెల 7వ తేదీ నిర్వహించనున్న మెగా పేరెంట్స్– టీచర్ మీటింగ్‌కు తల్లిదండ్రులను పిలవాలని సాంఘిక సంక్షేమశాఖ డీడీ బి.శ్రీనివాసులు వసతి గృహంలో ఉంటున్న పిల్లలకు శనివారం సూచించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రాన్ని తయారుచేసి తల్లిదండ్రులకు పంపాలన్నారు.

108లో ఈఎంటీ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్) : అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో 108 వాహనాల్లో ఖాళీగా ఉన్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ) పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని ఆ వాహనాల జిల్లా మేనేజర్ బాలకృష్ణ తెలిపారు. జీఎన్‌ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బి.ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు డిసెంబర్ 2వ తేదీ సోమవారం సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి) ఆవరణలో దిశ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న 108 కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 83284 61648, 96420 27098 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

3న యండమూరితో ముఖాముఖి

నెల్లూరు(బృందావనం) : పుర మందిరంలో ఈనెల 3వ తేదీ ఉదయం 9 గంటలకు వినోద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ ఫౌండేషన్ ఫౌండర్ మనపాటి చక్రవర్తి శనివారం తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

కామేశ్వరరావుకు నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్ ఉద్యోగుల్లో వెలుగులు నింపేందుకు బలిదానం చేసుకున్న కామేశ్వరరావు వర్ధంతిని స్థానిక విద్యుత్‌భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎస్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు శేషాద్రి బాలచంద్ర, సోమశేఖర్‌రెడ్డి, డీఈఈ మునీంద్ర, అకౌంట్స్ ఆఫీసర్ విజిత, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలో విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జాతీయ ఆర్చరీ పోటీల్లో నెల్లూరు లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి చాట్ల అక్షయ్ మహదేవ్ మూడు పతకాలు సాధించి ప్రతిభ కనపరిచారు. ఇటీవల గుజరాత్‌లో జరిగిన 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో చాట్ల అక్షయ్ మహదేవ్ రికర్వ్ రౌండ్‌లో 30 మీటర్ల విభాగంలో రజత పతకం, ఓవరాల్ రికర్వ్ రౌండ్‌లో 1352 పాయింట్లతో రజతం, టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా శనివారం మంత్రి నారాయణ తన క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని అభినందించారు.

భక్తిశ్రద్ధలతో రుద్రహోమం



నెల్లూరు(బృందావనం) : కార్తీక అమావాస్య సందర్భంగా మూలాపేటలోని శంకరమఠంలో మహామృత్యుంజయ అమృత పాశుపత రుద్రహోమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితులచే నిర్వహించిన హోమ పూజలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. శంకరమఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా కె.నాగేంద్రకుమార్ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిశోర్– ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

ఘంటసాల జయంతి నేడు

నెల్లూరు(బృందావనం) : పురమందిరంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి ఉత్సవం ఘనంగా జరుగనుందని నిర్వాహకుడు నీలకంఠం శ్రీనివాసులురెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఘంటసాల సుమధుర సినీ సంగీత విభావరి నిర్వహించి, ప్రముఖ తబలిస్ట్ నెల్లూరుకు చెందిన ఎం.శాంతికుమార్‌కు సన్మానం చేయనున్నట్లు తెలియజేశారు. ఘంటసాల అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డీకేడబ్ల్యూలో సర్టిఫికెట్ కోర్సు

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఈనెల 2వ తేదీ నుంచి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ అనే సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 సీట్లు మాత్రమే ఉన్నాయని, ఈ కోర్సులో చేరేందుకు 18 నుంచి 35 ఏళ్ల లోపు మహిళలు అర్హులన్నారు. పదో తరగతి, ఆపైన చదివిన వారు కోర్సులో చేరవచ్చన్నారు. కోర్సు పూర్తి చేసిన అనంతరం సర్టిఫికెట్, ఉద్యోగ కల్పన ఉంటుందన్నారు. ఆసక్తి గల మహిళలు 86398 67407 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఏడు టౌన్ బస్సుల సీజ్

- రూ.1.40 లక్షల అపరాధ రుసుం విధింపు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు (టౌన్) : నగరంలో రవాణా శాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించి ఏడు బస్సులను సీజ్ చేశారు. టౌన్ బస్సుల యాజమాన్యాల ఆగడాలపై శనివారం సాక్షి దినపత్రికలో అడిగేదెవరు ... అడ్డు చెప్పేదెవరు అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రవాణాశాఖ ఉప రవాణా కమిషనర్ బి.చందర్ ఆధ్వర్యంలో రవాణా అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి నగరంతో పాటు కోవూరు, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల్లో టౌన్ బస్సులను తనిఖీ చేశారు. పర్మిట్ ఇచ్చిన రూట్లకు విరుద్ధంగా తిరగడం, వారికి ఇచ్చిన సమయపాలన పాటించకపోవడం, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను పాటించకపోవడం గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఏడు టౌన్ బస్సులపై కేసులు నమోదు చేయడంతో పాటు రూ.1.40 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా డీటీసీ చందర్ మాట్లాడుతూ ప్రతిరోజు టౌన్ బస్సులపై ప్రత్యేకంగా తనిఖీలు చేపడుతామన్నారు. రెండోసారి నిబంధనలకు విరుద్ధంగా బస్సు పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ తనిఖీల్లో ఇన్‌చార్జి ఆర్టీఓ బాలమురళి, ఎంవీఐలు కార్తీక్, షేక్ రఫీ, బాబు, ఏఎంవీఐలు రఘువర్ధన్‌రెడ్డి, స్వప్నిల్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.


టౌన్ బస్సును సీజ్ చేసిన రవాణా అధికారులు

జోరు వర్షం



ఫెంగల్ తుఫాన్ కారణంగా నెల్లూరు నగరాన్ని జోరు వర్షం వీడడం లేదు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు కూడా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చలిగాలులు కూడా తోడు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమైంది. అండర్ పాస్‌లలో నీరు నిల్వ చేరి వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నెల్లూరు


కేవీఆర్ సెంటర్‌లో..


కొత్త హాలు సెంటర్‌లో కురుస్తున్న జోరు వర్షం


గాంధీబొమ్మ సెంటర్‌లో పగలే చీకట్లు


వర్షంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఉత్తమ అధ్యాపకునికి సన్మానం



నెల్లూరు (టౌన్) : రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్న పి.మునిరాజును స్థానిక స్టోన్ హౌస్‌పేటలోని కేవీసీ జూనియర్ కళాశాలలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా చేస్తున్న మునిరాజు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాసోత్సవం


ఉత్సవమూర్తులకు హారతి ఇస్తున్న అర్చకులు

నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న కార్తీక మాసోత్సవాలు శనివారం పరిసమాప్తమయ్యాయి. చివరి రోజు స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమాలు, పూజలు నిర్వహించారు. ఆకాశదీప ముగింపు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా ఆనం రామనారాయణరెడ్డి– శిరీష, ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి– లత దంపతులు వ్యవహరించారు. దేవస్థానం ఈఓ జంజం శ్రీనివాసరావు పర్యవేక్షించారు.


స్వామివారి సన్నిధిలో విశేష పుష్పాలంకరణ


మూలస్థానేశ్వరులు ప్రాకారోత్సవం

విద్యార్థులకు పోటీలు

నెల్లూరు (టౌన్) : ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి పట్ల కళాశాల ప్రిన్సిపల్ గిరి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులను మానవహారంగా ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏక్యూఏసీ కో–ఆర్డినేట్ వింధ్యావతి, వైస్.ప్రిన్సిపల్ రమణారావు, క్లబ్ సభ్యులు అనిత, నాగశ్యామల, మనోజ్‌ప్రభాకర్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్ మస్తాన్ అనారోగ్యం నుంచి కోలుకోవడంతో కోటమిట్ట షాదీ మంజిల్‌లో పేదలకు అన్నదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబ్దుల్‌మస్తాన్ త్వరగా కోలుకోవడం సంతోషంగా ఉందని, పేద ప్రజలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ కరిముల్లా, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్‌అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజాహుస్సేని, సిద్ధిక్, షేక్.మీరామొహిద్దీన్, మున్వర్, యస్దాని పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


శిక్షణ పొందిన మహిళలతో డీఆర్‌డీఏ పీడీ

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట) : మహిళలు కుటుంబం, ఆర్థిక బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ అన్నిరంగాల్లో రాణించాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి సూచించారు. సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో మహిళలకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కష్ట సుఖాలను ధైర్యంగా ఎదుర్కొంటూ మహిళలు ముందుకు సాగాలన్నారు. మహిళలకు శారీరక వ్యాయామం, పౌష్టికాహారం అవసరమన్నారు. ఈ విషయాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న మహిళలకు యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో జేడీఎం హైమావతి, శిక్షణా సిబ్బంది నిరీక్షణ, సౌజన్య, ఉమామల్లిక, తిరుపతిరావు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారికి శనివారం పుష్పాభిషేకం నిర్వహించారు. ఉభయకర్తలుగా గడ్డం రత్నయ్య– సుజాతమ్మ, సంగమయ్య– నాగమ్మ దంపతులు, కుటుంబసభ్యులు వ్యవహరించారు.

శ్రీస్వామి అయ్యప్ప సేవాసమాజం అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కత్తి మోహన్‌రావు, గడ్డం విజయకుమార్, పావళ్ల ప్రసాద్ పర్యవేక్షించారు.

నేత్రపర్వం.. శివపార్వతుల కల్యాణం

ఇందుకూరుపేట : కార్తీక మాసం చివరిరోజు తీరప్రాంత గ్రామమైన మైపాడులో అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం శనివారం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను వివిధ పుష్పాలతో అలంకరించి ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. మైపాడుతో పాటు పరిసర ప్రాంతాలైన నరసాపురం, రావూరు, కొరుటూరు, సోమరాజుపల్లి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలుత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, గో పూజలు జరిగాయి. మధ్యాహ్నం కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు.